# అమాయకుడు

అర్ధరాత్రి దాటింది. తలుపు చప్పుడు నిద్రలేచింది వసంత. బయటనుండి ఎవరో పిలిచినట్టు వినిపించింది. లేచి ఫ్యాన్ ఆపుచేసింది. ఈసారి గొంతు స్పష్టంగా వినిపించింది. వసంతగుండె జల్లుమంది. ఐదేండ్ల తర్వాత వినిపించిన ఆగొంతు ఆమెను పులకరింపచేసింది.

"రాము...దివ్యా...లెవ్వుండ్రి బిడ్డా!....మీ బాపచ్చిండు. పదిహేనురోజులనుండి చూసి చూసి కండ్లు కాయలుగాసినయా." ఆతృతగా పిల్లల్ని నిద్రలేపింది వసంత. ఏదో తెలియని ఉద్విగ్నత చోటు చేసుకుందామెలో. విడిపోయిన వెంట్రుకల్ని ముడివేసుకుంది. సోఫాలో ఉన్న వస్తువుల్ని కిందికి సర్ది దులిపింది. పిల్లలిద్దరూ నిద్రలేచి చుట్టూ చూస్తూ 'బాపేడీ' అని అడిగారు. తలుపు తెరువలేదని అప్పుడు గుర్తొచ్చింది వసంతకు. తన ఆతృతకు తానే నవ్వుకుంటూ వెళ్ళి తలుపు తెరిచింది.

ఒక్కసారిగా ఫారిన్ సెంటు గుప్పుమన్నది. నవ్వుతూ ఇంట్లోకి అడుగుపెట్టాడు గోపాల్. పదేళ్ళ దివ్య తండ్రిని అల్లుకుపోయింది. ఏడేళ్ళ కొడుకు మాత్రం బెరుగ్గా చూస్తూ నిలబడ్డాడు. గోపాల్ వెళ్ళేప్పుడు అతడివయసు రెండు సంవత్సరాలే! అందుకే గుర్తు పట్టడం లేదు తండ్రిని. గోపాల్ ముందుకు అడుగువేసి బిత్తరపోయి చూస్తున్న కొడుకును అక్కున జేర్చుకున్నాడు. ఈడేరిన పిల్లలముందు భర్తను కౌగిలించుకోవడానికి బిడియపడింది వసంత. అతడే దగ్గరగా వచ్చి ఆమె భుజాలచుట్టూ చేతులు వేసి నవ్వాడు. ఆమె కళ్ళల్లో ఆనంద బాష్పాలు మొలిచాయి.

పరామర్శలయ్యాక డ్రైవర్ సహాయంతో జీపులోని సామానులన్నింటిని ఇంట్లో పెట్టాడు గోపాల్. కిరాయి డబ్బు ఇచ్చి జీపును పంపించాడు. ఈ అలికిడికి ఒకరిద్దరు పక్కింటివాళ్ళు లేచి గోపాల్‌ను పలకరించారు. గబగబా బియ్యం కడిగి అన్నం వండింది. కూర చేస్తానంటే వద్దన్నాడు గోపాల్! చప్పటికూడు తిని తినీ నాలిక చప్పబడిపోయింది. ఆవకాయ తొక్కు పెరుగుపోసుకుంట అన్నాడు. అలాగే అన్నట్టు తలూపింది కానీ ఆమె మనసు బాధతో మూల్గింది.

ఇండియా వస్తున్నానని నెలరోజులక్రితమే ఉత్తరం రాసాడు గోపాల్. అప్పటినుండి ప్రతీరోజు ఎదురుచూస్తుంది. రోజుల గడుస్తుంటే ఆమెలో ఆందోళన పెరగసాగింది. బొంబాయిలో దిగినాక ఏవో మోసాలు జరుగుతాయని విన్నది. అందుకే వరుసగా మూడు ఉత్తరాలు వ్రాసింది. వాటికి బదులురాలేదు. అదే విషయాన్ని బాధగా అడిగింది.

'మన అయ్యనా అవ్వనా! ఉండుమంటే ఉండాలె. పొమ్మంటే పోవాలె' అంటూ టైంకు కంపెనీ ముదీర్ పెట్టిన ఇబ్బంది. అప్పుడే వచ్చిన కొత్త కాంట్రాక్టులు, మరో ఆరునెలల వరకూ ఉండాలని ఒత్తిడి చేయడం, కొట్లాట పెట్టుకుని వచ్చిన విషయం చెబుతూ భోజనం ముగించాడు.

కొద్దిసేపు కూతురు నీ కొడుకును పక్కన కూర్చోబెట్టుకుని మాట్లాడాడు. బంధువుల క్షేమ సమాచారాలు అడిగితెలుసుకున్నాడు. ఊరి వివరాలు ఎవరెవరు ఎక్కడ ఉన్నదీ వివరంగా చెప్పింది వసంత. పిల్లలిద్దరూ నిద్రపోయారు. భర్త వచ్చాడన్న ఆనందం వసంతను నిద్రకు దూరం చేసింది. గోపాల్‌కు కూడా ఇంటికి చేరుకున్నాననే ఆనందంతో నిద్రరావడం లేదు. తాను తెచ్చిన బంగారాన్ని, ఎలక్ట్రానిక్ వస్తువులను, డాలర్లు, బట్టలు, ఇతర వస్తువులను భార్యకు చూపించాడు.

వాటికి ఎంత ఖరీదయిందో చెప్పాడు గోపాల్. మనసులోనే లెక్కవేసుకుంది. యాభై వేయిలపైనే అయ్యాయి. అందులో ఏ వస్తువూ పెద్దగా అవసరం లేదనిపించింది. ఇంతడబ్బు పెట్టి వీటిని ఎందుకు తెచ్చాడు. అమ్మాయిపేరు మీద బ్యాంకులో వేసినా బావుండేది అనుకుంది. చేతిలో డబ్బులేక తిండికి తిప్పలు పడినరోజులు గుర్తుకొచ్చాయి. అతడు నొచ్చుకుంటాడని తన అసంతృప్తిని బయటకు కనబడనీయలేదు. మాటా ముచ్చటా మాట్లాడుకుంటూ ఎప్పుడో తెల్లవారు జామున నిద్రపోయారు.

కన్నంటుకుని మెలకువవచ్చింది వసంతకు. అప్పటికే బారెడు పొద్దుపైకెక్కింది. మెలకువ రానందుకు తనని తాను తిట్టుకుంటూ బిడియంగా తలుపుతెరిచింది. అప్పటికే గోపాల్ రాక అనోట అనోట ఊరంతా తెలిసిపోయింది. రోజూ కూరుకుపొద్దుండగనే లేచే వసంతను చూసి ఆరోజు ఇరుగు పొరుగు వారు గుసగుస లాడుతూ నవ్వుకున్నారు. అంతవరకూ తలుపు తట్టడానికి వెనకా ముందాడిన వారు తలుపు తెరుచుకోగానే మాట్లాడించడానికి ఇంట్లోకి వచ్చారు. గోపాల్‌ను లేపి చీపురుతో వాకిట్లోకి నడిచింది వసంత. ఇల్లునిండా మందిని చూసాక ఐదు సంవత్సరాల క్రితం జరిగిన సంఘటన కళ్ళముందు కదిలింది.

ఆరోజు అర్ధరాత్రి దాటాక బొంబాయినుండి ఇంటికి వచ్చాడు గోపాల్. ఆవిషయం తెలియగానే ఇలాగే ఇల్లు నిండారు. వారికళ్ళల్లో కోపం, మొహంలో అసహనం, మాటల్లో బిరుసుతనం ఉన్నాయి. వచ్చినవారి వైపు భయంగా చూసింది వసంత. తలో మాట అంటున్నారు. వారి వద్ద అప్పుచేయడం వల్లనే అలా చులకనగా మాట్లాడుతున్నారని గ్రహించి మౌనంగా ఉండి పోయింది. 'నువ్వు మస్కట్ పోవు గిస్కట్ పోవు. మస్కట్ పట్నమనుకున్నావా! ఇల్లు అమ్మేసి కొన్ని బాకీలు కట్టు. ఎవలకన్న జీతముండి మిగిలిన బాకీలు తేర్చు.' అంటూ వసంత వైపు తిరిగి 'వానికి బుద్దిలేకుంటే నీకన్న బుద్ధుండద్దానే...మస్కట్ మస్కట్ అని ఊరన్ని బాకీలు జేస్తిరి. నేలమీదుండి మొగులుమీదికి కాలు జాపితే అందుతాదే!' అన్నాడు ఈసడింపుగా రాంరెడ్డి. వెర్రి చూపులు చూస్తుండిపోయింది వసంత. ఇచ్చిన బాకీలు తీర్చమని ఒత్తిడి చేసారు. రెండు రోజులు పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టలేదు. పిల్లల్ని ముందేసుకుని ఏడుస్తూ కూర్చుంది. ఓదార్చడానికి ఎవరూ ముందుకు రాలేదు.

'అగాగు...చీపురు దుమ్ము మీద పడుతది.' అన్న మాటవిని తలెత్తి చూసింది వసంత. ఎదురుగా రాంరెడ్డి కనిపించాడు. పక్కకి జరిగి నిలబడుతూ 'నువ్వాపటేలా! చూత్తలేను' అన్నది రాంరెడ్డి నవ్వుతూ' ఇప్పుడు నేనెక్కడ కనబడుత. ఐదేండ్ల కింద అప్పు ఇచ్చిననాడు కనబడిన. గోపాల్ వచ్చిండంట గదా! చూసిపోదామని వచ్చిన' అంటూ ఇంట్లోకి నడిచాడు.

'అప్పు ఇచ్చిందొక్కటే యాదికుంది. ఆ తర్వాత ఎంత ఆగం జేసిందీ.....ఎన్ని మాటలన్నదీ ఎంత మిత్తి వసూలు చేసిందీ యాదికిలేనట్టుంది' అనుకుంటూ పని ముగించుకుని ఇంట్లోకి నడిచింది.

ఈయేడు సిరిసిల్లకు మకాం మార్చాలి. పిల్లలిద్దర్నీ ప్రైవేటుస్కూల్లో చేర్పించాలి. మంచి చదువు చదివించాలి. ఇక్కడుండి చేసేదేంలేదు. వీలైతే అక్కడ సిరిసిల్లలో ఒక చిన్న దుకాణం పెట్టుకోవాలి. తను ఎలాగూ బీడీలు చేస్తుంది. అతడు దుకాణంలో కూర్చుంటాడు అనుకుంటుంది వసంత. భర్త రాకతో అల్లుకున్న ఆశలు ఉక్కిరి బిక్కిరి చేస్తుంటే ఏమేంచేయాలో ఆలోచిస్తూ ఇంట్లోకి నడిచిన వసంత భర్త చేస్తున్న పనిచూసి నిర్ఘాంతపోయింది.

మూటను విప్పి వచ్చిన వారందరికీ కానుకలుగా వస్తువులు ఇస్తున్నాడు గోపాల్. మధ్యలో కుర్చీ వేసుకుని కూర్చుండి చుట్టూ మూగిన వారివైపు గర్వంగా చూస్తూ ఈ వస్తువులు తనకు ఓ లెక్క కావు అన్నట్టు ఎవమచేత్తో తీసి అందిస్తున్నాడు. వచ్చిన జనం అతడిని పొగుడుతున్నారు. రాంరెడ్డి అతడు అందించిన గొడుగును అందుకుని మరీ మరీ పొగుడుతున్నాడు. మస్కట్ నుండి వచ్చిన వారిలో ఇంత దాన గుణం ఉన్నవాడిని తానెప్పుడూ చూడలేదంటున్నాడు.

వసంతకు మతి పోయినట్టయింది. మౌనంగా ఇంట్లోకి నడిచి తనపనిలో మునిగిపోయింది. వచ్చేవారు వస్తూనే ఉన్నారు. ఇచ్చే కానుకలు ఇస్తూనే ఉన్నాడు. ఎన్నడూ పలకరించనివారు కూడా వచ్చి పలకరించి పోతున్నారు. గోపాల్ కళ్ళల్లో వారితో పొగిడించుకోవాలనే తపన, పొగుడు తుంటే తృప్తి కనిపించాయి ఆమెకు.

చాలా సేపటితర్వాత స్నానం చేయడానికి ఇంట్లోకి వచ్చాడు గోపాల్. ఉండబట్టలేక మెల్లిగా అన్నది వసంత. "మనం అలా కానుకలు పంచితే యాదిజేస్తరనుకుంటం గానీ ఎవ్వలు యాదిజెయ్యరు. ముంగట ముచ్చటాడి ఎనుక ఎక్కిరిత్తరు. ఎన్ని లక్షలు సంపాయించిండోనని గుమానుపోతరు. ఎవలకో ఇచ్చెటోల్లకు ఇయ్యాలె. అదీ వారం పదిరోజులయినంక ఇయ్యాలె. నువ్వు గిట్ల తెల్లారంగనే దుకాణం పెట్టుకున్నవు."

భార్యవైపు అసహనంగా చూసాడు గోపాల్. అతడి చూపులకు గాబరాపడి మాట మార్చాలని ప్రయత్నించింది వసంత. ఆమె మాటలు వినకుండా నిర్లక్ష్యంగా అన్నాడు." అన్నీ కలిపితే నా నెలజీతం గాదు. పోతేపోయినయి తియ్యి. రోజు ఇత్తమా! దేశం పోయిండంటే ఎవలైన ఆశ పడుతరు."

అతడి మాటలకు మౌనంగా ఉండిపోయింది వసంత. స్నానం చేసి బట్టలు వేసుకుని సెంట్స్ప్రే చేసుకుని బయటికి వచ్చాడు గోపాల్. తెల్లటి టీషర్ట్, నల్లటి జీన్ ప్యాంటులో హీరోలా ఉన్నాడు. ఊర్లో ఉన్నప్పుడు బుడ్డగోచీ బనీను తప్ప షర్ట్ తొడుక్కుని ఎరుగడు. అందరూ తన వైపు ఈర్ష్యగా చూస్తుంటే గర్వంగా నవ్వుకుంటూ కనిపించిన వారిని పలకరిస్తూ ఊరంతా కలియ దిరిగాడు. హోటల్లో కూర్చుండి అక్కడున్నవారందరికీ చాయలు టిఫిన్లు ఆర్డరిచ్చాడు. మస్కట్ గురించి అక్కడ తన జీతం గురించి గొప్పగా చెప్పుకున్నాడు. డబ్బు తనకు ఓ లెక్కకాదన్నట్టు మాట్లాడి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తాడు.

"ఊర్లెకు ఈరోజే వస్తివి. ఇప్పుడే ఊరంతా తిరిగిరాకుంటే ఊరు చిన్నపోతుండెనా! అయినా ఇది మస్కటనుకున్నావా! సెంట్లు గింట్లు కొట్టుకొని తిరిగితే ఓర్వరు. తనసొమ్మయినా దాసుకుతినాలె. డబ్బు ఉన్నాలేనట్టు ఉండాలె." భర్త ఇంట్లోకి రాగానే నవ్వుతూ అన్నది వసంత.

"అట్లెందుకుండాలెనే! మనం ఎవడిదన్నా దోచుకచ్చినమా దొంగతనం చేసినమా! మన డబ్బు మన ఇష్టం. ఎన్ని రోజులు మనం చీకట్ల ఉందాం. ఎన్ని రోజులు మనం అమాయకుల లెక్క ఉందాం. రైతులు, రెడ్లు, రావులు చూడుపో! ఇంట్ల ఏం లేకున్నా రుబాబుగా తిరుగుతరు. వాళ్ళకంటె నేనేంతక్కువ సంపాయించిన్నా. నేనెందుకు రుబాబుగా తిరుగొద్దు" దేవుడిచ్చినకాడికి నాకూ డబ్బుంది. అది లేనినాడు నేను దొరలదగ్గర జీతమున్న ఇప్పుడు కూడా దొరలెక్క ఎందుకుండద్దు" అన్నాడు గోపాల్.

మొహం చిన్నబుచ్చుకుంది వసంత. డబ్బు అతడిలో ఎంతటి మార్పును తెచ్చిందో అంచనా వేసుకుంటుంది. ప్రతిపనిలో డాబూ దర్పంను ప్రదర్శించడం ఆమెకు నచ్చడంలేదు. అదృష్టం బావుండి డబ్బు సంపాదించుకున్నాం. ఆకుచాటు పిందెలాగ మనబతుకేదో మనం బతక్క ఈ పనేంటీ అనుకుంటుంది. నాలుగురోజులాగాక నచ్చచెప్పాలి. కొత్త కొత్తగ అలాగే ఉంటుంది అని సర్దిపెట్టుకుంది. రోజులు గడుస్తున్నా గోపాల్‌లో మార్పురాలేదు. పొద్దున లేవగానే నీట్‌గా తయారై బయటపడుతున్నాడు. సిగరెట్లు విరివిగా పంచిపెడుతున్నాడు. చాయలు తాగిస్తున్నాడు. రాత్రి కల్లు పెట్టెలకు ఆర్డర్ ఇస్తున్నాడు. ఊరిలో పెద్ద మనుషులుగా చెలామణి అవుతున్నవారు, అవారా తిరిగేవారు అతడిచుట్టూ చేరి ఆకాశానికి ఎత్తేస్తున్నారు. అతడిని క్షణం కూడా ఇంట్లో ఉండనివ్వడం లేదు. ఇదంతా గమనించి ఆందోళనకు గురవుతుంది వసంత.

బంధువుల రాకపోకలు తగ్గిపోయాక ఒకనాడు భర్తతో అతడు పంపిన డబ్బు లెక్కలన్నీ చెప్పింది వసంత. ఇవన్నీ ఇప్పుడెందుకు. ఉన్నయి ఉంటయిలే అని విసుక్కున్నాడు గోపాల్.

"నీకేంది మారాజువు. ఏబాధలేకుండా వెళ్ళిపోతివి. ఐదేండ్ల పొద్దుఎట్ల తెల్లారి పొద్దుగూకిందను కున్నవు. ఇక్కడ అప్పులోల్లు ఎన్నెన్ని మాటలన్నరనుకున్నవు. ఒక్కొక్కసారి ఉరేసుకుని చచ్చిపోదామని పిస్తుండె. ఇయ్యాల్ల చేతిల బెల్లమున్నదని ఈగలలెక్క చుట్టుకుంటుండ్రు. ఎన్నడన్న మన ఇంటికి వచ్చి ఆపద సంపద అడిగిండ్రా. మన చేతుల నాలుగు పైసలల్లేకపోతే ఎవ్వలు దగ్గరికిరాకపోదురు. అందుకే చేతుల పైసలున్నప్పుడే కాపాడుకోని తిరుగాలె. వాడు నావోడే వీడు నావోడే అని ఇష్టమున్నట్టు ఖర్చపెడితే ముందటి లెక్క అప్పులపాలైపోతం." హెచ్చరిస్తున్నట్టుగా అన్నది వసంత.

ఆమెను వెర్రిదాన్ని చూసినట్టు చూసాడు గోపాల్. "పిచ్చిదానా! పైసమనను సంపాయిస్తదా, మనం పైసను సంపాయిస్తమా! పైసలు ఒడిసిపోతున్నాయని బాధపడుతున్నావా...? నువ్వు గట్టేంరంది పెట్టుకోకు. ఏది చెయ్యాలే ఏది చెయ్యగూడదు నాకు బాగా తెలుసు. మన గొల్లోల్ల ఇండ్ల దిక్కు ఇంతకు ముందు ఒక్కరైతచ్చిండా ఒక్క పెద్దమనిషి వచ్చిండా! ఇప్పుడు చూడు మన ఇంటిచుట్టూ తిరుగుతున్నరు. నేను కూసుండుమంటే కూసుంటరు. నిలుచుండు మంటే నిలుచుంటరు." మందలిస్తున్నట్టుగా అన్నాడు గోపాల్.

భర్తకు ఏదో చెప్పబోతూ సుంకరి రావడంతో ఆగిపోయింది వసంత. గోపాల్‌తో సర్పంచ్ రమ్మంటున్నాడని చెప్పి వెళ్ళిపోయాడు సుంకరి. భార్యవైపు గర్వంగా చూసి చెప్పాడు గోపాల్.

"సర్పంచ్ హైదరాబాద్ వెళ్తుండు. అక్కడ ఏదో పనుందట. తోడుగా నన్ను రమ్మన్నాడు. వాళ్ళ బామ్మర్ది కారులో వెళ్తున్నము. రెండు రోజుల తర్వాత తిరిగివస్తాం."

"అతడి వైపు విస్మయంగా చూసింది వసంత." "పట్నంల నీకేంపని. వాళ్ళకు మనకు కలుస్తదా. తాతలు తండ్రులు సంపాయించిన భూములున్నయి. అమ్మికుని తింటరు. మనకేమున్నయి. నిన్న ఇయ్యాల్ల కొద్దిగ తెల్లగ బతుకుతున్నము. ఇయ్యాల్ల రమ్మని ఖర్చుపెట్టి తాగిపిస్తడు. మల్లోనాడు నిన్ను ఖర్చుపెట్టుమంటడు..." ఆమె మాటలు పూర్తిగాకముందే అందుకున్నాడు గోపాల్.

"వాళ్ళు రమ్మనుడెక్కువనా మనం పోవుడెక్కువనా....ఎంతోమంది అక్కడ కూర్చున్నా నన్నే పేరు పెట్టి పిలిచి పట్నం పోదామన్నడు. రానంటే అంతమందిల చిన్నతనం కాదా. బయటి విషయాలు నీకు తెల్వయి. తినేజాగల తినాలె. పెట్టే జాగల పెట్టాలె. మనకులంల ఎవడే పెద్ద మనుషులతోని కూర్చుండి తినెటోడు. అందరు బుడ్డగోచి ఎగజెక్కుకుని వంగి వంగి దండాలు పెట్టేటోల్లే. అంటూ బట్టలు మార్చుకుని బయటకు నడిచాడు.

రెండు రోజులు ఖరీదైన హోటల్లో బస చేసారిద్దరు. చిన్నప్పటినుండి విలాసవంతమైన జీవితం గడిపాడు కాబట్టి మామూలుగానే ఉన్నాడు ప్రకాశ్‌రావు. గోపాల్‌కే ఏదో బిడియంగా ఉంది. అలాంటి హోటల్‌లు తానుకూడా తిరిగినట్టుగా ప్రవర్తిస్తున్నాడు. భోజనం వద్ద మెనూకార్డ్ తెరిచి తనకు కావలసినవి ఆర్డర్ ఇచ్చాడు ప్రకాశ్‌రావు. తనుకూడా స్టయిల్‌గా కార్డ్ తెరిచి చికెన్ టిక్కా' అన్నాడు గోపాల్. అదేంటో ఇంతవరకు చూడలేదతను. ఇంకేదైనా ఆర్డర్ ఇవ్వు' అన్నాడు ప్రకాశ్‌రావు. ఇంకేం చెప్పాలో తెలియక 'చాలు' అన్నాడు. బేరర్ ప్లేట్‌లో నాలుగు ముక్కలు తెచ్చాక సర్పంచ్ ఎందుకన్నాడో అర్థమైంది. వెంటనే సర్ది చెబుతున్నట్టుగా రాత్రిపూట తాను ఎక్కువగా తిననని అది మస్కట్‌లోనే అలవాటయిందని చెప్పాడు. ప్రకాశ్‌రావుకు మనసులో ఇవ్వకూడదని ఉన్నా గట్టిగా వాదించకతప్పలేదు. ఉన్నరెండు రోజులు తెలివిగా గోపాల్ చేతబిల్లు కట్టించాడు ప్రకాశ్‌రావు. ఎక్కడికి వెళ్ళినా వెంట గోపాల్‌ను తీసుకువెళ్ళాలని నిశ్చయించుకున్నాడు కూడా. అప్పుడప్పుడూ నీది బారీగుణంరా. నువ్వు గొల్లిండ్లల్ల పుట్టేదిగాదురా' అని చిన్న చిన్న పొగడ్తలతో గోపాల్‌లో ఉత్సాహాన్ని పుట్టిస్తున్నాడు. వచ్చేప్పుడు ఇద్దరూ బస్‌లోవచ్చారు. ప్రకాశ్‌రావు వెంట ఊరిలో నుండి నడిచివస్తుంటే గోపాల్‌కు ఎంతో ఆనందంగా ఉంది. ఎదురైన వారల్లా అతడికి దండం పెడుతూ తనక్కూడా దండం పెడుతుంటే గర్వంగా అనిపిస్తుంది.

ఇంటికి వచ్చాక పట్నం విశేషాలు. ఎక్కడెక్కడ తిరిగింది వసంతకు వివరించి చెప్పాడు. "మానాయిన వాళ్ళ నాయినకు జీతమున్నడు. నేను చిన్నప్పుడు ఆయనకు జీతమున్న. చెయ్యెత్తి మొక్కుడే తప్ప చేతిలో చెయ్యి కలిపి ఎరుగను. ఇప్పుడు చూడు. నేను తాగిన గిలాసలు కడిగిండు. పొద్దుగల్ల లేచినంక పక్కబట్టలు దులిపిండు.

"పైసలు ఎగజల్లుతుంటే ఎవరైనా ఎంబడి తిరుగుతరు. ఐదు వెయిలు తీసుకపోయినవేమో అవి అయిపోయేదాక తిరిగినవు. ఇట్ల ఖర్చుపెడితే బతుకు బజారుపాలై పోతది." ఖాళీ జేబును చూస్తూ అన్నది వసంత విసుగ్గా.

భార్యవైపు కోపంగా చూసాడు గోపాల్. నీకు పైసల పిచ్చి పట్టింది. ఈ ఖర్చంతా కలిపితే మస్కట్‌ల నా పదిహేనురోజుల జీతంగాదు. ఇక్కడ పైసముఖ్యంగాదే...పరువు ముఖ్యం. ఇంతకు ముందు నేను సగం ఊరికి కూడా తెల్వదు. ఇప్పుడు నాకు తెల్వనోల్లు కూడా పేరు పెట్టి మాట్లాడు తున్నారు. పంచాదులల్ల నన్ను పంజీగా కోరుకుంటుండ్రు. నేను ఏందంటే అదే సై అంటుండ్రు. వాళ్ళకు నేనేమన్న పైసలిచ్చిన్నా...."అడిగాడు గోపాల్.

మౌనంగా ఉండిపోయింది వసంత. ఎలా చెబితే అతడు అర్థం చేసుకుంటాడో తెలియడం లేదు. ఇక్కడినుండి వెళ్ళిపోతేనైనా దారికి వస్తాడేమోననుకుని భోజనాలవద్ద మెల్లిగా కదిపింది. పిల్లలకు మంచి చదువు చెప్పించాలని, వాళ్ళను తెలివిపరులను చేస్తే ఒకరికి ఎదురు చూడకుండా బ్రతుకుతారని, తమలెక్కవాళ్ళు కష్టాల పాలుకాకుండా ఉండాలని, ఆడపిల్లకైనా చదువు ఉంటే తప్ప మంచి సంబంధంరాదని నచ్చచెబుతూ సిరిసిల్లకు మకాం మారుద్దామని చెప్పింది వసంత.

"సిరిసిల్లలో ఎందుకు.....? హైదరాబాద్‌లో మంచి హాస్టల్‌లో వేద్దాం. నేను సర్పంచ్‌ను అడిగి తెలుసుకుంటాను. వాళ్ళ పిల్లలు ఏడ చదువుకుంటున్నారో తెలుసుకుని వీలుంటే అదే హాస్టల్‌లో వేద్దాం" అన్నాడు గోపాల్.

బిత్తరపోయి చూస్తుండిపోయింది వసంత. కొద్దిసేపటి తర్వాత గొంతుపెకల్చుకుని అన్నది. "హాస్టల్‌లో వేయడమంటే మాటలా...ఏడాదికి ఇరవై వెయిలు. ఇద్దరికీ నలభై వెయిలు. ఇతర ఖర్చులు పది వెయిలు. మొత్తం యాభై వెయిలు. ఇంత ఖర్చుపెట్టి ఎన్నేండ్లు చదివిస్తం. చేతుల డబ్బు చదువులకే అయిపోతే పెండ్లీలు ఎలా చేస్తం. ఇంతఖర్చు చేస్తూ ఇక్కడ ఉండి మనం చేసేదేముంది."

"అది నువ్వే అంటవు. ఇది నువ్వే అంటవు. చదువుకావాలంటవు. పైసలు ఖర్చుగావద్దంటవు" కోపంగా అన్నాడు గోపాల్.

భర్తకు సముదాయిస్తున్నట్లుగా అన్నది వసంత. నేను చెప్పేది పూర్తిగా విను. మనకు భూమి జాగల్లేవు. ఇక్కడ మనం చేసే పనేంలేదు. ఒక ఇల్లు కిరాయికి తీసుకుందాం. వీలుంటే దుకాణం పెట్టుకుందాం. నీకు ఇష్టంలేకుంటే సరే. ఉన్నడబ్బు బేంకులో వేసుకుని నెల నెలా మిత్తి తీసుకుందాం. నేను ఎలాగూ బీడీలు చేస్తాను. ఖర్చు తక్కువైనట్టుంటది. పల్లెల చదువు అయినట్టుంటది. గోపాల్‌కు నిజమే అనిపించింది. సరేనని తలూపాడు. వసంతకు ఎంతో సంతోషం వేసింది. ఆ విషయం గురించి చర్చిస్తుండగా సర్పంచ్ ఇంటినుండి పిలుపు వచ్చింది. తొందరగా వస్తానని చెప్పి వెళ్ళాడు గోపాల్. ప్రకాశ్‌రావుతో మాట్లాడుతూ తాను సిరిసిల్లకు మారుతున్న విషయం కూడా గొప్పగా చెప్పాడు.

అతడు వెళ్ళిపోతానుఅంటే ఏదో వెలితి అనిపించింది ప్రకాశ్‌రావుకు. ఎలాగైనా అతడిని ఆపాలనుకున్నాడు. 'నీకేం పిచ్చిరా గోపాల్' అంటూ మొదలుపెట్టి సిరిసిల్లకు పోతే ఎదురయ్యే కష్టాలు గోరంతలు కొండంతలుగా చెప్పాడు. అతడి మాటల్ని ఒప్పుకోకపోతే తనకు తెలువదను కుంటాడని' నువ్వన్నది కూడా నిజమే అనుకో అన్నాడు. ఇంటికి వచ్చాక అదే విషయం భార్యతో చెప్పాడు. అతడి అమాయకత్వానికి నవ్వాలో ఏడ్వాలో అర్థం కాలేదు వసంతకు. తప్పకుండా సిరిసిల్ల పోవలసిందేనని పట్టుబట్టింది.

ఆమె వైపు ఈసడింపుగా చూసాడు గోపాల్. "అయినవాళ్ళను, కులాన్ని పాలివాళ్ళను విడిచి అక్కడికెళ్ళి ఏం చేద్దాం. ఇక్కడే రెండెకరాల భూమి కొందాం. ఇల్లు కట్టుకుందాం. మన ఊర్లె మనం ఏం చేసినా ఫలానా గోపాల్ అని గుర్తింపు ఉంటది. 'ఎరుగని ఊర్లె మొరుగని కుక్క అన్నట్టు' అక్కడ ఏం గుర్తింపు ఉంటదే" అన్నాడు విసుగ్గా.

"భూమి మనకెందుకు. మనం ఎవుసం జేస్తమా? పాలికిస్తే సగం పంట అటేపాయె. వంగి కష్టం చేసేదుంటే భూమికొనుక్కోవాలె. పాలుకు ఇచ్చేబదులు అదే డబ్బు బెంకులో వేసుకుంటే మంచిది. ఇక్కడ కట్టే ఇల్లే అక్కడ కడితే కిరాయి వస్తది."

మతిలేకుండా మాట్లాడకు. ఒక జీతగాన్ని పెట్టకుంట. నాలుగు ఎకరాల ఎర్ర చెల్క తీసుకుని అచ్చుకడుతా. బోర్ వేయించి ట్రాక్టర్‌తో దున్నిస్త. మాతాతల తండ్రుల నాడు గూడా మాకు నాలుగెకరాలు లేదు. జీతముండుట తప్ప జీతముంచుకునుడు తెల్వది. మన ఊర్లె ఎవ్వలకు లేనటువంటి ఇల్లు కడుత. ఊరందరు పరేషాన్ గావాలె. ఫలానా గోపాల్ తెగారం జూడుండ్రి అని నలుగురు చెప్పుకోవాలె. గా సిరిసిల్లల ఇల్లుకడితే మనపేరు ఎవలన్న యాది జేస్తరా" అన్నాడు ధృఢంగా.

బిత్తరపోయి చూస్తుండిపోయింది వసంత. ఏం చెప్పాలో ఎలా చెప్పాలో ఆమెకు అర్థం కాలేదు. ఎలాగైనా అతడిని ఒప్పించి పొలం ఇల్లు కొనడం మాన్పించాలనుకుంది. భార్యకు తెలిస్తే అడ్డు చెబుతుందని తెలియకుండానే నాలుగు ఎకరాల బీడు భూమి కొన్నాడు గోపాల్. ఊర్లో ఉన్న ట్రాక్టర్ ఓనర్లిద్దరూ గోపాల్‌తో స్నేహం చేసి పొలం అచ్చుకట్టేందుకు గుత్తకు తీసుకున్నారు. ఆ విషయం వసంతకు తెలిసేసరికి అచ్చుకట్టడం పూర్తయిపోయింది.

వసంత పుట్టింటికి వెళ్ళింది. భర్త చేస్తున్న దుబారా ఖర్చులన్నీ అన్నతో చెప్పుకుని ఏడ్చింది. చెల్లెల్ని వెంటబెట్టుకుని వచ్చి బావకు హితబోధ చేసాడు ఇస్తారి. తనకు ఎంత భూమి ఉన్నది, ఎన్ని గొర్లు మేకలున్నది, ఎంత డబ్బున్నది చెప్పి, తను ఎంత మాములు జీవితం గడుపుతున్నది చెప్పాడు. గోపాల్ బావమరిదిని కసురుకున్నాడు. నువ్వా నాకు చెప్పేది నా యిష్టం అని నిష్టూరమాడాడు. నువ్వు పిశిడోనివి, రోకలిబండకు నారలు దీత్తవు. అని వెక్కిరించాడు. ఇస్తారి మొహం చిన్నబుచ్చుకుని వెళ్ళిపోయాడు.

సర్పంచు ప్రకాశ్‌రావుకు గోపాల్‌కు సాన్నిహిత్యం పెరిగిపోయింది. ఎటువెళ్ళినా గోపాల్‌ను వెంట బెట్టుకుని వెళ్తున్నారు. అప్పుడే విద్యాకమిటీ ఎన్నికలు వచ్చాయి. గోపాల్‌ను అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ముందుగా గోపాల్ ఒప్పుకోలేదు. అందరి బలవంతం మీద ఒప్పుకున్నాడు. మరునాడే అతడికి పాఠశాల తరపున సన్మానం జరిపించి మంచినీటి వసతి లేక పిల్లలు ఇబ్బంది పడుతున్నారని చెప్పాడు ప్రధానోపాధ్యాయుడు. గోపాల్ లాంటి తెలిసిన వ్యక్తి ఛైర్మన్ అయ్యాక మంచినీటి కొరత ఉండదన్నాడు ప్రకాశ్‌రావు. మరికొన్ని పొగడ్తలు జతచేసి చెప్పాడు. ఆ మాటలకు తబ్బిబ్బయి పోయాడు గోపాల్. బోర్ సాంక్షన్ అయ్యాక బిల్లు పెట్టి డబ్బు తీసుకుంటానని ముందుగా తన డబ్బు పెట్టి బోర్ వేయిస్తానని ప్రకటించాడు గోపాల్. అనుకున్నట్టుగానే డబ్బుపెట్టి బోర్ వేయించాడు గోపాల్. అలాంటి ఛైర్మన్ దొరకడం తమ అదృష్టమని పొగిడారు ఉపాధ్యాయులు.

అతడు మారడని తెలిసిపోయాక వసంతకు బెంగ పట్టుకుంది. ఇంతకు ముందు బయట జరిగిన విషయాలు, తను చేయబోయే పనులు చెప్పేవాడు. ఇప్పుడలా చెప్పడంలేదు. బయటివాళ్ళు చెబితేగానీ తెలియడం లేదు వసంతకు. అప్పుడప్పుడూ జరిగే కొట్లాట రోజూ జరుగుతుంది ఇంట్లో. రెండుమూడు సార్లు వసంత పై చేయి చేసుకున్నాడు గోపాల్. చెప్పినా వినకుండా ఊరిలో కొందరు రైతులు బ్రతిమాలితే కరిగిపోయి లక్షరూపాయలవరకు అప్పుఇచ్చాడు.

రాంరెడ్డి బిడ్డ పెళ్ళి చేసి అప్పులపాలయ్యాడు. ఇంటివెనకగా ఉన్న అర ఎకరం పెరడు అమ్ముతానని అందరితో చెప్పాడు. పంట పండే పొలం కాకపోవడంతో కొనడానికి ఎవరూ ముందుకు రాలేదు. అతడు బాగా ఆలోచించి గోపాల్‌ను కలిసాడు. ఆపెరట్లో ఇల్లుకడితే ఊరి మధ్యలో ఉంటుందని, విశాలంగా ఉంటుందని, దాన్ని కొనే దమ్ము నీ ఒక్కడికి తప్ప ఊరిలో మరెవరికీ లేదని గొప్పగా పొగిడాడు. ఆ పెద్ద రైతు పెరడును కొని అక్కడ ఇల్లుకట్టడం గొప్ప విషయంలా తోచిందతనికి. వసంత వద్దని చెప్పినా వినకుండా కొనేసాడు గోపాల్. జీతగాన్ని పెట్టి వ్యవసాయం చేయిద్దామని కొన్న పొలంలో రెండు బోర్లు వేయించాడు. అవి ఫేలయిపోయాయి. అప్పుడే స్కూల్ బిల్డింగ్ కొత్తగా సాంక్షన్ అయింది. కాంట్రాక్టు పట్టుకుని కట్టించడానికి ఎవరూ ముందుకు రాలేదు. ఫండ్స్‌ల్యాప్స్ అయిపోతాయని అధికారులు గోపాల్ ఇంటిచుట్టు తిరిగారు. కాంట్రాక్టు పట్టుకుంటే చాలా లాభం ఉంటుందని చెప్పాడు సర్పంచ్ ప్రకాశ్‌రావు. ఊర్లోని పెద్దలందరూ ఆపని గోపాల్ మాత్రమే చేయగలడు' అన్నారు. అప్పటికే పెద్ద రైతులను, పెద్దమనుషులను పేర్లు పెట్టి పిలవడం, వరుసలు పెట్టి పిలిచే చొరవ ఏర్పడింది గోపాల్‌కి.

'నాకెందుకు బావా. ఆ కాంట్రాక్టేదో నువ్వే పట్టుకో.' అన్నాడు సర్పంచ్‌తో. ఎలాగూ బోర్ వేయించావు. ఆడబ్బుకూడా ఇందులోంచే తీసుకోవచ్చు. నువ్వు ఛైర్మన్‌వు కాబట్టి నాకంటే ఎక్కువ అధికారాలు నీకే ఉంటాయి అని నచ్చజెప్పి కాంట్రాక్టుకు ఒప్పించాడు. వారంరోజులో స్కూల్ బిల్డింగ్ పని మొదలెట్టాడు గోపాల్. లంబాడి తండల్లోకి వెళ్ళి టేకు కట్టెను బేరం చేసాడు. దొంగతనంగా సైజులు కోయించే ఏర్పాటుచేసాడు. ఇల్లుపని, బడిపని, పొలంపని ఉంటుంది కాబట్టి ట్రాక్టర్‌ను కొనాలనుకున్నాడు. అనుకున్నదే తడువుగా బ్యాంక్‌లో కొంత లోన్ తీసుకుని ట్రాక్టర్‌ను కొన్నాడు. పెద్దకులస్థుడి కొడుకును డ్రైవర్‌గా జీతం పెట్టుకున్నాడు.

వసంత భర్తను ఎదిరించడం మానేసింది. అప్పటికే అలిగి రెండు మూడుసార్లు పుట్టింటికి వెళ్ళింది. వారం పదిరోజులు చూసి గోపాల్ రాకపోవడంతో తనే వచ్చేసింది. బ్యాంక్‌లో ఉన్న డబ్బుపై ఆశ వదులుకుంది. అవి పూర్తిగా ఖర్చయితే తప్ప అతడికి బుద్ధిరాదని నిర్ణయించుకుంది. యాంత్రికంగా పని చేసుకుపోవడం అలవాటు చేసుకుంది.

ఇల్లుప్లాన్ గీయించి ముగ్గుపోయించాడు గోపాల్. పునాదులు తీయించి బేస్‌మెట్ లేపాడు. స్కూల్ పని పూర్తికాగానే ఇంటిపని మొదలెట్టాలనుకున్నాడు. ట్రాక్టర్ ఉందికదా అని మరో బోర్ వేయించి వ్యవసాయం మొదలెట్టాలనుకున్నాడు. ఈసారి బోర్ సక్సెస్ అయింది. కరెంట్ సాంక్షన్ చేయించుకుని మోటార్ పెట్టించాడు. సంతోషంగా గొర్రెను కోయించి డిన్నర్ చేసాడు. ట్రాక్టర్ చేత నాలుగు ఎకరాలను దున్నించి నాటువేసాడు. అప్పటికి స్కూల్ బిల్డింగ్ పూర్తయింది. మొదటి ముప్పైవెయిల బిల్ మాత్రమే వచ్చింది. తర్వాత వచ్చే బిల్స్ ఆగిపోయాయి. తనచేతిలోంచే డబ్బు

ఖర్చుపెట్టి పనిపూర్తి చేయించాడు గోపాల్. స్కూల్ బిల్డింగ్ ఓపెన్ చేయడానికి వచ్చిన అధికారులు బిల్లు తొందరగా వచ్చేట్టు చేస్తామని హామీ ఇచ్చారు.

తను ఖర్చుచేసిన డబ్బు, తనకు వచ్చేడబ్బు లెక్కచూసుకున్నాడు గోపాల్. ముప్పైవేయిల నష్టం వచ్చింది. పోతేపోయిందిలే, బడి కట్టించిన పేరు ఉంటుంది అని సర్దిపెట్టుకున్నాడు. మళ్ళీ ఇటువంటి కాంట్రాక్టులు పట్టుకోకూడదని కూడా నిర్ణయించుకున్నాడు. నష్టం వచ్చిన సంగతి చెబితే ఎక్కడ నవ్విపోతారో అని చెప్పలేదు. ఇంటికి పిల్లర్లు పోసి గోడలను పైకప్పువరకు లేపాడు. స్కూల్ డబ్బు చేతికి రాగానే స్లాబ్ వేయాలనుకున్నాడు. అప్పటికే బ్యాంక్‌లో డబ్బు అయిపోయింది. పిల్లర్లకు గోడలకు అప్పుచేయాల్సి వచ్చింది. పంట చేతికివస్తే అరవై డెబ్బయి వేయిలు వస్తాయని స్కూల్ డబ్బులతో కలిపితే ఇల్లు పూర్తయి అప్పులు తేరిపోతాయని ఊహించాడు గోపాల్. అక్కడే అతడి ప్లాన్ తలక్రిందులయింది. వర్షాలులేక బోర్ నాలుగు ఎకరాలకు నీరును అందివ్వలేక పోయింది. ఏపుగా ఎదిగిన పైరు ఎండిపోవడం మొదలెట్టింది. దానికితోడు కరెంటు కోత అప్పుడే మొదలయింది. పదిహేనురోజుల్లో ఎకరం పొలం మాత్రమే తడవడం మొదలెట్టింది. ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది.

స్కూల్ డబ్బు కొరకు తిరగడం మొదలెట్టాడు గోపాల్. అది అందలేదు. ట్రాక్టర్ లోన్ కట్టడానికి మరిన్ని అప్పులు చేయాల్సి వచ్చింది. డ్రైవర్‌కు జీతం ఇవ్వలేక ట్రాక్టర్‌ను తనే నడుపుకోవడం మొదలెట్టాడు. కిరాయిలు, గుత్తాలు పట్టుకున్నా నష్టమే వచ్చింది. ఇల్లుపని ఆగిపోయింది. పొలం కోతకు వచ్చేనాటికి ఎకరంలోంచి సగం ఎండిపోయింది. వచ్చిన దాన్యం కూలీలకు సరిపోలేదు. గోపాల్ ఆర్థికంగా దెబ్బతిన్నాడని గ్రహించి ఒక్కొక్కరు దూరమయ్యారు. ప్రకాశ్‌రావు మాట్లాడ్డం మానేసాడు. అప్పుడుకాని అతడి కడుపుమంట చల్లారలేదు.

అధికారుల వెంట తిరిగి అతికష్టంమీద స్కూల్ బిల్ సాంక్షన్ చేయించుకున్నాడు. కమీషన్‌లు పోగా తక్కువ మొత్తం డబ్బు మాత్రమే చేతికి అందింది. అది ట్రాక్టర్ లోన్ కట్టడానికే సరిపోయాయి. అప్పు అప్పుగానే మిగిలిపోయింది. తను అనుకున్నంత పని జరిగిందని బాధపడింది వసంత. మౌనంగా ఏడ్వడం తప్ప ఏమీ చేయలేకపోయింది. డ్రైవింగ్ వచ్చినా అంతగా అనుభవం లేకపోవడంతో పొలం దున్నడానికి వెళ్తూ ట్రాక్టర్‌ను చెట్టుకు గుద్దాడు గోపాల్. ట్రాక్టర్ ముందు భాగం దెబ్బతిన్నది. గోపాల్ కాలు విరిగింది. హాస్పిటల్‌లో చేర్పిద్దామన్నా డబ్బులేదు. ఇంట్లో ఉన్న విలువైన ఫారిన్ వస్తువులను అమ్మి హాస్పిటల్‌లో చేర్పించింది వసంత. ఒకరిద్దరు తప్ప వెంట తిరిగిన వారెవరూ పలకరించడానికి క్కూడా రాలేదు. గోపాల్‌కు తను చేసిన తప్పు తెలిసిపోయింది. తన నోటితో అంటే భార్యముందు చులకనైపోతానని గంభీరంగా ఉంటున్నాడు. పదిహేను రోజుల తర్వాత కొద్దిగా కోలుకొని ఇంటికి వచ్చాడు.

ట్రాక్టర్ బాగు చేయిద్దామంటే డబ్బులేదు. దానికి లోన్ కట్టాలి. అప్పులవాళ్ళు ఒత్తిడి చేస్తున్నారు. పొలం అమ్ముతానని చెప్పాడు. కానీ నీరులేని పొలం మాకెందుకని ఎవరూ ముందుకు రాలేదు. ట్రాక్టర్‌ను కొంటామన్నారు. కానీ తక్కువ ధరకు అడిగారు. చేసేదిలేక ట్రాక్టర్‌ను అమ్మేసాడు. బ్యాంక్‌లో ట్రాక్టర్ లోన్ పూర్తిగా తీర్చేశాడు. మిగతా అప్పులే తీరలేదు. డబ్బు మిగల్లేదు.

టీ.వి., వి.సి.ఆర్., కెమెరా లాంటి మిగిలిపోయిన వస్తువులని భార్యమెడలోని బంగారాన్ని అమ్మేసి బాకీలు తీర్చాడు. ఐదేండ్లక్రితం పరిస్థితి ఎలా ఉందో ఇప్పుడు కూడా అలాగే ఉంది. గోపాల్ పరిస్థితి తెలిసి బావమరిది ఇస్తారి వచ్చాడు. మొదటిసారిగా గుండెబరువుదిగిపోయేలా అతడి మీదపడి బావురుమని ఏడ్చాడు గోపాల్. అతడిని ఊరడించడం కష్టమైంది. అతడిలో మార్పు రావడం అందరికీ సంతోషాన్ని కలిగించినా ఈమార్పేదో ముందుగా వచ్చిఉంటే కొంత డబ్బు అయినా మిగిలేదికదా అనుకుంటున్నారు.

"ఇస్తారి....మీరెవ్వరు చెప్పినా వినకపోతి...ఇక్కడ నాకు బతుకు దెరువులేదు. పూలమ్మిన జాగల కట్టెలు అమ్మలేను. అటుదిక్కు ఎక్కడనన్నా పనిచూడు. మీ తమ్మునికి చెప్పి ప్రైవేటు ఫ్యాక్టరీలనన్న చిన్న పని చూడుమను. లేకుంటే నా పిల్లలు ఉపాసముంటరు." దీనంగా చెప్పాడు గోపాల్. అతడి ఆమాటలు విన్నాక వసంతక్కూడా దుఃఖం ఆగలేదు. అన్న మీదపడి బావురుమంది. వాళ్ళ పరిస్థితి చూస్తే ఇస్తారికి గుండె చెరువైపోయింది.

"నువ్వు ఇక్కడుంటే బాగుపడవు బావా. ఎంత చేసినా బట్టకు పొట్టకు మాత్రమే సరిపోతది. నవ్వు బాగుపడాలంటే మళ్ళీ మస్కట్ పోవాల్సిందే! నాకు తెలిసిన ఏజంట్ ఉన్నాడు. చాలా నమ్మకస్తుడు. డబ్బంతా నేను ఖర్చుపెట్టుకుంటాను. అక్కడికి వెళ్ళాక జీతం వచ్చాకనే పంపించు. నీపాస్‌పోర్ట్ ఇస్తే ఏజంట్‌కు ఇస్తాను. నెలరోజుల్లో విజా తెచ్చే ఏర్పాటు చేస్తాను." అన్నాడు ఇస్తారి.

కళ్ళల్లో నీళ్ళు కమ్ముతుంటే బావమరిది వైపు కృతజ్ఞతగా చూసాడు గోపాల్.